పురస్కారాల ప్రదానం



టీహెచ్ నటరాజరావును పురస్కారంతో సత్కరిస్తున్న ఆచార్య కిషన్‌రావు

నాంపల్లి: ఆధునిక తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రవేసిన ప్రముఖ కవి డాక్టర్ తిరునగరి అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య టి.కిషన్ రావు అన్నారు. కవన మిత్ర సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు వర్సిటీ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో జరిగిన డాక్టర్ తిరునగరి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి కిషన్ రావు హాజరై ప్రసంగించారు. డాక్టర్ తిరునగరి సాహిత్య అభిమాని పెసరు లింగారెడ్డి ప్రతి ఏటా ఆయన పేరిట ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలను ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పద్య సంపుటి విభాగంలో 'భూ విలాపం'గ్రంథ రచయిత అవధానం టీహెచ్.నటరాజరావుకు, ఉత్తమ వచన కవితా సంపుటి విభాగంలో 'చింతల తొవ్వ'గ్రంథ రచయిత తుల శ్రీనివాస్‌లకు డాక్టర్ తిరునగరి స్మారక సాహిత్య పురస్కారాలు అందజేసి సత్కరించారు. ప్రముఖ కవులు, సాహితీవేత్తలు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ పెసరు వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ గడ్డం మోహన్‌రావు, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, గడ్డం లక్ష్మయ్య డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండిరాజుల శంకర్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నాతకోత్సవం



అబిడ్స్: దంత వైద్యులకు క్లీనికల్ నైపుణ్యం ఎంతో అవసరమని ఏఐఏడీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునీల్ కోఠావర్ పేర్కొన్నారు. దంత వైద్యుల వృత్తి ఎంతో సున్నితమైందన్నారు. ఏఐఏడీ సొసైటీ 12వ స్నాతకోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కోఠావర్ మాట్లాడుతూ.. దంతవైద్యుల ప్రాముఖ్యత సమాజంలో ఎంతో విలువైందన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో దంతవైద్యుల వృత్తికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ మోటుపల్లి, సయ్యద్ ఉద్దీన్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ బసవలింగం, డాక్టర్ నవీన్ గుప్తా, డాక్టర్ సుజిత్ పరదేశి పాల్గొన్నారు.

'ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు సమ్మేళనాలు దోహదం'



సమ్మేళనంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ తదితరులు

అబిడ్స్: ప్రజల్లో ఐక్యతా భావాలు పెంపొందించేందుకు దసరా సమ్మేళనాలు ఎంతో దోహద పడుతాయని మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ పేర్కొన్నారు. గుఫానగర్‌లో జరిగిన లోధ్ సమాజ్ దసరా సమ్మేళన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. లోధ్ కులస్థుల్లో ఐక్యత భావాలు పెంపొందించేందుకు దసరా సమ్మేళనాలు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ సందర్భంగా లోధ్ సమాజ్ నాయకులు లాల్‌బహదూర్ సింగ్, రాజేష్ సింగ్, నరేందర్‌సింగ్, రితేష్ సింగ్, సంతోష్ సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగాలోధ్ కులస్థుల ఓట్లు ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్‌కు గోషామహల్ బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. బీజేపీ తరహాలో బీఆర్‌ఎస్ కూడా లోధ్‌కే టికెట్ ఇవ్వాలన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



గన్‌ఫౌండ్రీ: నృత్యాంగణ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యగురువు నిత్య రామనాథన్ శిష్యురాలు రాంపల్లి అక్షయ భరతనాట్య ఆరంగేట్రం ఆదివారం రవీంద్రభారతిలో జరిగింది. వినాయక స్తుతి, పుష్పాంజలి శబ్దం, వర్ణం, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..ముంబైలో స్థిరపడినప్పటికీ సొంత ప్రాంతానికి వచ్చి నృత్య ప్రదర్శనలు ఇవ్వాలనుకోవడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, తల్లిదండ్రులు శ్రీరమ, శ్రీధర్ పాల్గొన్నారు.

సందడిగా 5కే రన్

సాక్షి, సిటీబ్యూరో: బీఎస్ఎన్ఎల్ టెలికాం సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5కే రన్ సందడిగా సాగింది. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు రన్‌లో హుషారుగా పాల్గొన్నారు. బీఎస్ఎన్ఎల్ భవన్ దగ్గర ఈ రన్‌ను బంజాల్ డైరెక్టర్ వివేక్ ప్రారంభించారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

గోల్కొండ కోటలో 'టాక్ ఫర్ హెల్త్'

గోల్కొండ: నడక దివ్య ఔషధం లాంటిదని ప్రముఖ ఫిజిషియన్ గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండ కోటలో 'టాక్ ఫర్ హెల్త్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటకు వచ్చిన పలువురు పర్యాటకులు, కోట సెక్యూరిటీ గార్డులు, హిస్టరీ గైడ్స్‌లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నడకతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు సైతం చదువులకే పరిమితం కాకుండా క్రమం తప్పకుండా తమ తల్లిదండ్రులతో కలిసి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ఖరీముద్దీన్, టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిపై దాడి అబద్ధం

లంగర్‌హౌస్: కాంగ్రెస్ అభ్యర్థిపై దాడి అబద్ధమని పోలీసులు తేల్చారు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మొహమ్మద్ అల్ హజ్రి శనివారం రాత్రి కార్యకర్తలతో లంగర్‌హౌస్‌లో ప్రచారం చేస్తున్నారు. పెన్షన్‌పురలోని గోల్డెన్‌జూబ్లీ పాఠశాల వద్దకు రాగానే ఎదురుగా ఎంఐఎం నాయకులు ప్రచారం నిర్వహిస్తూ వస్తున్నారు. ఆ సమయంలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు తమపై దాడి చేశారని కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అక్కడ ఇరు పార్టీలవారు ఎదురైన సమయంలో ఒకరికి ఒకరు పోటీగా గట్టిగా తమ పార్టీలకు జిందాబాద్‌లు కొడుతూ నినాదాలు చేసుకున్నట్టు ఫుటేజీల్లో కనిపించిందన్నారు. స్థానిక సాక్షుల నుంచి వివరాలు సేకరించగా ముందుకు వెళ్లకుండా అక్కడే నిలబడి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎంఐఎం కార్యకర్తలపై కేసు నమోదు చేసి ఫిర్యాదు చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి

నాంపల్లి: జేబులను కత్తిరించే ఓ దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నోబుల్ టాకీస్ చౌరస్తాలో చోటుచేసుకుంది. అందరూ చూస్తుండగానే ఓ దొంగ రెచ్చిపోయారు. దారిని వెళ్తున్న ఓ వ్యక్తిని అటకాయించి దారి దోపిడీ చేసే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునే క్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దొరికిన దొంగ తప్పించుకునేందుకు కుప్పిగంతులు వేశారు. ఎట్టకేలకు అతడిని పోలీసులు రక్షక్ ద్వారా పీఎస్‌కు తరలించారు. పోలీసుల అదుపులో దొంగతో పాటుగా ఒక మహిళ కూడా ఉన్నారు.

'సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తాం'



మాట్లాడుతున్న రచయిత్రులు

సుల్తాన్‌బజార్: విలువ కోల్పోని మన సాహిత్య వారసత్వాన్ని, కాలానుగుణంగా అందివస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయించి వినూత్న శైలిలో రచనలు చేస్తామని యువ రచయిత్రులు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన యువ రచయిత్రుల సమ్మేళనంలో రెండవరోజు పలు ఆసక్తికరమైన అంశాలపై చర్చలు జరిగాయి. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతలు మెర్సీ మార్గరెట్, మానస ఎండ్లూరి, ఆజాదీకా అమృత మహోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్ చరిత్ర గ్రంథానికి బహుమతి పొందిన సుకన్య భువనగిరి, ఇటీవలి కాలంలో తమ అద్భుత రచనలు ప్రచురించి సాహితీ విమర్శకుల ప్రశంసలు అందుకున్న యువ రచయిత్రులు, కవయిత్రులు, ఎన్.లహరి, రక్షిత సుమ, స్ఫూర్తి కందివనం, పల్లె దీక్షిత గౌడ్, రాగలీన, సోనీ కట్కూరి తమ భవిష్యత్తు రచన ప్రణాళికలను పంచుకున్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ సాహిత్య వికాసమే ప్రధాన ఆశయంగా కొనసాగుతున్న పరిషత్తు అన్ని భావాలకు వేదికగా నిలుస్తుందన్నదని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ.. ఈ సమ్మేళనంలో ప్రతిభ కనబరిచిన కవయిత్రు లు, రచయిత్రుల కోసం మలి విడత అధ్యయన శిబిరం నిర్వహించి తెలంగాణ సగర్వంగా చెప్పుకోగలిగిన సాహితీమూర్తులను త యారు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అధ్యాపకురాలు డాక్టర్ దాసోజు పద్మావతి, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ ప్రసంగించారు.

'ఈసారి కూడా బీఆర్‌ఎస్‌కే పట్టం'



చార్మినార్: ఈసారి కూడా బీఆర్‌ఎస్‌కే ప్రజలు పట్టం కట్టనున్నారని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన సుల్తాన్‌షాహీలో సమావేశం నిర్వహించి తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సయ్యద్ మహ్మద్ అహ్మద్, మనోజ్ బిడ్లా, మమతా బిడ్లా, రాజేష్ పర్బా, అనీల్ బిడ్లా, అజయ్ బిడ్లా పాల్గొన్నారు.

ఓడిన్ స్కూల్‌తో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒప్పందం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

అబిడ్స్: ఓడిన్ స్కూల్‌తో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఓడిన్ స్కూల్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ విజయ్ పసుపులతి మాట్లాడుతూ.. గణనీయమైన అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఓడిన్ స్కూల్ ప్రారంభించామన్నారు. దేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సహకరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఓడిన్ స్కూల్ పట్టభద్రులు ఇప్పుడు జాతీయ ప్రభుత్వ సంస్థచే ధ్రువీకరించబడతారన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పోర్టల్ నుంచి వారి సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. ఓడిన్ స్కూల్ విద్యార్థులు వాల్‌మార్ట్, బాష్, ఇన్ఫోసిస్, ఐబీఎం, ఫెడ్‌ఎక్స్, జేపీ మోర్గాన్ మొదలైన కంపెనీల నుంచి పరిశ్రమ అనుభవజ్ఞులతో బోధింపబడుతారన్నారు.

మత్తు మాత్రలు విక్రయించే వ్యక్తి అరెస్టు

నాంపల్లి: నిషేధించబడిన మత్తు మాత్రలను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 3420 నైట్రావెట్ టాబ్లెట్స్, 22 కోడైనీ పాస్పేట్, క్లోరోఫినిరామైన్ మాలియేట్ ఎస్కుప్ సిరప్ బాటిల్స్, ఒక వివో సెల్‌ఫోన్, రూ.16,780 నగదును స్వాధీనం చేసుకున్నారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్జల్‌సాగర్ ప్రాంతానికి చెందిన ఎస్.ప్రకాష్ కుమారుడు నాడే చక్రధారి(40) కొన్ని నెలలుగా నైట్రావెట్ 10 ఎంజీ టాబ్లెట్లను అమాయకపు యువకులకు విక్రయిస్తున్నారు. ఈ టాబ్లెట్ల ద్వారా యువత మత్తులో ఉండి అసాంఘిక కార్యక్రమాలు చేసే అవకాశం ఉన్నందున స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. వీటిని కర్ణాటకలోని గుల్బర్గా నుంచి నగరానికి తీసుకుని వచ్చి విక్రయిస్తున్నట్లుగా పోలీసులు నిర్ధారించారు. అతడి ఇంట్లోనే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో నాడే చక్రధారిపై ఆర్‌జీఐఏ శంషాబాద్, గోపాలపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పిక్‌పాకెటింగ్ కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో నాడే చక్రధారి సోదరి నైనా కూడా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అబిడ్స్‌లో ఫ్లాగ్‌మార్చ్

అబిడ్స్: ఎన్నికల సందర్భంగా పోలీసులు అబిడ్స్ పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం దాదాపు 5 కిలోమీటర్ల పాటు అడిషనల్ డీసీపీ ఆనంద్, అబిడ్స్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహాలతో పాటు వందలాది మంది పోలీసులు ప్రజల్లో మనోధైర్యాన్ని పెంచేందుకు ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని బ్యానర్ ప్రదర్శించారు.

'గెలిపించండి..అభివృద్ధి చేస్తా'



ప్రచారం చేస్తున్న రాజేష్ కుమార్

దూద్‌బౌలి: ఈ ఎన్నికల్లోతనను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. ఈ ప్రాంతం అభివృద్ధికి పాటు పడతానని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ స్థానిక ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం తన కార్యకర్తలు, నాయకులతో కలిసి కిషన్‌బాగ్ తదితర బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు పథకాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కన్నయ్య లాల్, ఇక్బాల్, జబ్బార్, సుమంత్ కుమార్, కృష్ణ, నజీర్, హరిబాబు పాల్గొన్నారు.

యుగ తులసి పార్టీ చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా కరుణ శివకుమార్



చాంద్రాయణగుట్ట: యుగ తులసి పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థిగా లలితాబాగ్‌కు చెందిన ఆడాల కరుణ శివకుమార్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు కె.శివ కుమార్ ఆమె పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ.. గోమాత రక్షణ కోసం పోరాడుతున్న యుగ తులసి పార్టీకి ప్రతి హిందూ బంధువు ఓటు వేయాలన్నారు. రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు.

కార్వాన్‌లో అసదుద్దీన్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అసదుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజవర్గంలో ఆదివారం మజ్లిస్ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్వాన్ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆయన మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్వాన్ నియోజకవర్గం మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్‌ను మరోసారి ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్‌కు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. మజ్లిస్ పార్టీ గుర్తు పతంగ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



బండారి వెంకటేష్‌ను సత్కరించిన దృశ్యం

అబిడ్స్: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు బండారి వెంకటేష్ పేర్కొన్నారు. దేశంలోనే ప్రజా అభివృద్ధి సంక్షేమంతో తెలంగాణ నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన బండారి వెంకటేష్‌ను ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండారి వెంకటేష్ మాట్లాడుతూ..ముదిరాజ్ కులస్థులకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఎంతో మేలు జరిగిందన్నారు. ముదిరాజ్‌లతో పాటు అన్ని కులాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదరణ కల్పిస్తుందన్నారు.

'బీఆర్‌ఎస్ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదు'



కార్వాన్ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న అభ్యర్థి మిత్రకృష్ణ తదితరులు

జంగ్ తెలంగాణ 2023

జియాగూడ: కార్వాన్‌లో ఈసారి బీఆర్‌ఎస్ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదని అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఆదివారం ఎస్‌డీఏ ప్యాలస్‌లో జియాగూడ డివిజన్‌లోని 58 బస్తీల్లో 56 పోలింగ్ బూత్ కేంద్రాలకు సంబంధించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, పార్టీలో చేరిక కార్యక్రమం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా హాజరైన మిత్రకృష్ణ కార్వాన్ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనకు కారు గుర్తుపై ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. 25 రోజుల పాటు కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అనంతరం నియోజకవర్గం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు, నేతలు, కార్యకర్తలను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు పట్లూరి రఘు, మాజీ అధ్యక్షుడు భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, హాడ్‌హాక్ కమిటీ సభ్యులు శేఖర్ రెడ్డి, పలు డివిజన్ల అధ్యక్షుడు చంద్రకాంత్, నరహరి చారి, రాములు, రాష్ట్ర కురుమ సంఘం యూత్ అధ్యక్షులు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, జబ్బర్, అల్తాఫ్, సి.బాబు, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు నర్మద, శ్రీనివాస్ గుప్తా, ఉమేష్, సంగీత పాల్గొన్నారు.

కార్వాన్‌లో హ్యాట్రిక్ సాధిస్తా: కౌసర్



మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులతో కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: మజ్లిస్ పనితీరు, మజ్లిస్ చేయించే అభివృద్ధి పనులే తనను గెలిపిస్తున్నాయని ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మజ్లిస్ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నామినేషన్ వేయడం, అనంతరం అనుచరించాల్సిన ఎన్నికల ప్రణాళికల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో మజ్లిస్ అపజయం అనేది ఎరగదని మజ్లిస్ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రణాళికల వల్ల ఆ పార్టీ రోజు రోజుకూ బలియమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందన్నారు. ఈసారి ఎన్నికల్లో సైతం అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదం తమ పార్టీకి ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా, బాకీరి తదితరులున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న అలీ మెహదీ

గౌలిపురా: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఏఐసీసీ అధికార ప్రతినిధి, యాకుత్‌పురా నియోజకవర్గం మీడియా ఇన్‌చార్జి అలీ మెహదీ అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రవిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పుగూడ అంబికానగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందన్నారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను గడప గడపకూ చేర్చాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పార్టీ రాజ్యమేలుతుందన్నారు. మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శులు అల్లం భాస్కర్, మామిడి కృష్ణ కుమార్, కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాజు యాదవ్, మామిడాల శ్రీనివాస్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.